క్లుప్తంగా

ఆకట్టుకుంటున్న రాగి కేక్‌లు



గొల్లప్రోలు ఆరోగ్య సురక్ష శిబిరంలో రాగి కేక్ పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పిఠాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసి పిల్లలు, తల్లులకు అందజేస్తున్న రాగి కేక్‌లు ఆకట్టుకుంటున్నాయి. మాతా శిశు సంరక్షణలో భాగంగా బలవర్ధకమైన ఆహారం అందించాలన్న ఉద్దేశంతో ఇప్పటికే రాగి జావ అందిస్తుండగా గొల్లప్రోలులో అంగన్‌వాడీ కార్యకర్తలు రాగి పిండితో తయారు చేసిన కేక్‌లను పిల్లలు, తల్లులకు పంపిణీ చేస్తున్నారు. రాగి పిండితో కేక్‌లు తయారు చేసి ఇవ్వడంతో పిల్లలు చాలా ఇష్టంగా తింటున్నారని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.మానసాదేవి తెలిపారు.

శృంగార వల్లభుడిని దర్శించిన 'కొమ్మినేని'



కొమ్మినేనికి స్వాగతం పలుకుతున్న వేద పండితులు

పెద్దాపురం: స్వయంభూ తొలి తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయంలో ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతను తెలుసుకున్న చైర్మన్ శ్రీనివాసరావు.. ఆలయ అభివృద్ధిలో ప్రతిఒక్కరి భాగస్వామ్యం అవసరమన్నారు. ప్రతిఒక్కరిలో ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ వి.జితేంద్ర, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, ఆలయ కమిటీ సభ్యులున్నారు.

పోటెత్తిన భక్తులు



శృంగార వల్లభ స్వామివారు

తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు విశేష ఏర్పాట్లు చేశారు. టిక్కెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా స్వామివారికి రూ.4,84,707ల ఆదాయం సమకూరినట్టు ఈఓ నారాయణమూర్తి తెలిపారు. భక్తులు, దాతలకు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాలను అందజేశారు. సుమారు 15 వేల మంది స్వామివారిని దర్శించుకోగా, వారికి ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించినట్టు ఈఓ తెలిపారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు పాల్గొన్నారు.

26న గుడివాడ అయ్యప్ప పడిపూజ

పెద్దాపురం: ఏటా గుడివాడ గ్రామంలో నిర్వహించే అయ్యప్ప పడిపూజ ఈ నెల 26న జరుగుతుందని గురుస్వామి, సర్పంచ్ కనపర్తి సీమదొర తెలిపారు. శనివారం వీరు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు రాత్రి 7 గంటలకు అయ్యప్ప స్వామి లక్ష బిల్వార్చన, పడిపూజ రేగడమిల్లి రామ్‌దేవ్ శర్మ (రాంబాబు స్వామి) ఆధ్వర్యంలో గురుస్వామి పెచ్చెటి నూకరాజు పర్యవేక్షణలో కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. మధ్యాహ్నం మేళతాళాలతో పేటతల్లి కార్యక్రమం ఉంటుందని, భారీ సంఖ్యలో స్వాములు పూజల్లో పాల్గొంటారని తెలిపారు.

పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ



సామర్లకోటలో చేసిన పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ

సామర్లకోట: పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పోలీసులు శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లోని అవుట్ పోలీసు స్టేషన్ వద్ద ఈ ర్యాలీని సీఐ కె.దుర్గాప్రసాద్ ప్రారంభించారు. పోలీసులను స్మరించుకుంటూ నినాదాలు చేశారు. ర్యాలీకి మద్దతుగా స్థానిక స్టేషన్ సెంటర్‌లోని ఆటోడ్రైవర్లు పాల్గొని, నివాళులర్పించారు. పోలీసు రింగ్ సెంటర్ వరకూ ర్యాలీ కొనసాగింది.

సారాతో వ్యక్తి అరెస్టు

సామర్లకోట: ఉండూరు శివారు వల్లూరు తూముల సమీపంలోని గణపతి ఆలయం వద్ద వెంకన్న అనే వ్యక్తిని 10 లీటర్ల సారాతో పోలీసులు శనివారం అరెస్టు చేశారు. తమకు అందిన సమాచారంతో కాకినాడ ఎస్ఈబీ పోలీసులు ఈ దాడి చేశారు.




ప్రత్యేక అలంకారంలో దుర్గాడ లలితాదేవి అమ్మవారు



కొమరగిరిలో మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



తాటిపర్తిలో కాళరాత్రిమాతగా దర్శనమిచ్చిన అపర్ణాదేవి



పాదగయ క్షేత్రంలో లక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరీదేవి



లలితా త్రిపురసుందరి అవతారంలో భువనేశ్వరి అమ్మవారు

లక్ష్మీదేవీ నమోస్తుతే..

- శ్రీలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన జగన్మాత
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

పిఠాపురం: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు శనివారం పాదగయక్షేత్రంలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారు శ్రీలక్ష్మీదేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా సందర్భంగా పాదగయ క్షేత్రంలోని రాజరాజేశ్వరీదేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో పదో శక్తి పీఠానికి అదిష్టాన దేవతైన పురూహూతికా అమ్మవారికి ప్రత్యేపూజలు నిర్వహించారు. దుర్గాడలో వేంచేసిన లలితాదేవి అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తాటిపర్తిలో వెలసిన అపర్ణాదేవి అమ్మవారు కాళరాత్రిమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. పిఠాపురం మండలం రాపర్తిలో దుర్గామల్లేశ్వరి అమ్మవారు ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పంచారామ క్షేత్రంలో చండీ హోమం



సామర్లకోట పంచారామ క్షేత్రంలో చేస్తున్న చండీహోమం



కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు

సామర్లకోట: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణ, మండల పరిధిలోని అమ్మవారి ఆలయాల్లో పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపురసుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిపారు. దుర్గాసప్తశతి పారాయణ, బాలా పరమేశ్వరీ మంత్రజపం చేశారు. నోరి కృష్ణారావు మాస్టారు ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. ఉత్సవాల ఏడో రోజు బాలాత్రిపుర సుందరి దేవిని మహిషాసురమర్ధినిగా అలంకరించారు. స్థానిక మెహర్ కాంప్లెక్స్‌లోని గణపతి ఆలయంలో ఉన్న మహాలక్ష్మి ఆలయంలో, రైల్వేస్టేషన్ సెంటర్, గాంధీచౌక్, బళ్లమార్కెట్ సెంటర్లతో పాటు బ్రౌన్‌పేట కనకదుర్గ, బడేలమ్మ చెరువు వద్ద ఉన్న నవదుర్గ, నీలమ్మ చెరువు వద్ద ఉన్న సత్తెమ్మ తల్లి, అయోధ్య రామపురంలోని కనకదుర్గ, సత్తెమ్మతల్లి, గాంధీనగర్‌లోని కనకదుర్గ, స్టేషన్ సెంటర్‌లోని నూకాలమ్మ ఆలయాలు, మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న అమ్మవార్ల ఆలయాల్లోను, వేట్లపాలెం బేతాళస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మహాలక్ష్మీదేవిగా అమ్మవారు

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా దేవీనవరాత్ర ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు శనివారం అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీధర్మశాస్తా ఆలయంలో వేంచేసిన కనకదుర్గ అమ్మవారికి ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కొమరగిరిలోని కనకదుర్గాదేవి అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



గొల్లప్రోలులో పాదాలమ్మ బోనాల గ్రామోత్సవం

ఘనంగా పాదాలమ్మ గ్రామోత్సవం

పిఠాపురం: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా గొల్లప్రోలు పాదాలమ్మ అమ్మవారి గ్రామోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పలువురు భవానీ భక్తులు, గ్రామస్తుల నడుమ వివిధ రకాల పూలతో అలంకరించిన బోనాలతో అమ్మవారి గ్రామోత్సవం కనుల పండుగా జరిగింది. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

శ్రీలలితా త్రిపుర సుందరి అవతారంలో..

పెద్దాపురం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక వర్జుల వారి వీధిలో ఉన్న శ్రీభువనేశ్వరి పీఠంలో శనివారం భువనేశ్వరి అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో మండప ఆరాధన, అమ్మవారికి అయ్యవారికి అభిషేకాలు, సహస్ర కుంకుమ పూజ, నవచండీ పారాయణం, శ్రీచక్రార్చన, చండీహోమం తదితర పూజలు నిర్వహించారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి మాట్లాడుతూ 23 ఏళ్లుగా అమ్మవారి పీఠంలో నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయని చెప్పారు. కాండ్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ అమ్మవార్లు శ్రీలలితా త్రిపుర సుందరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల ఈఓలు సీహెచ్ రామ్మోహనరావు, టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో వేద పండితులు, అమ్మవార్లను అన్నపూర్ణదేవి అవతారంలో అలంకరించారు.

పంచారామ క్షేత్రంలో కొమ్మినేని దంపతులు

సామర్లకోట: ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు దంపతులు శనివారం పంచారామ క్షేత్రాన్ని దర్శించారు. జిల్లా పర్యటనలో భాగంగా పిఠాపురం నుంచి సామర్లకోట శ్రీబాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన కొమ్మినేని దంపతులకు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు స్వాగతం పలికారు. మూలవిరాట్, స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకుని కొమ్మినేని దంపతులు పూజలు చేశారు. వీరివెంట ఆర్ఐ బాలాజీ, వీఆర్వోలు మురళీ, ఎస్ లోవరాజు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



ఉప్పాడలో కనకదుర్గాదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు సూచించారు. దసరాను పురస్కరించుకుని మండలంలోని ఉప్పాడలో ఆటో యూనియన్ సభ్యులు నెలకొల్పిన కనక దుర్గాదేవిని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులకు రూ.5 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కారే సుధ, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- కొత్తపల్లిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

కొత్తపల్లి: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. స్థానిక వీవీఎస్ ఆడిటోరియంలో శనివారం వైఎస్సార్ పీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ (ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి) కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు చేశారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చి మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఎంపీపీ కారే సుధ మాట్లాడుతూ చీకటి ముసుగులో ప్రతిపక్షాలు ఉన్నాయని, వెలుతురుతో ప్రజల పక్షాన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఉన్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్ మాట్లాడుతూ నవరత్న పథకాల అమలుతో సీఎం జగన్ చరిత్ర సృష్టించారన్నారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబు దోపిడీ చేయడం, పచ్చ నేతలకు పంచిపెట్టడం తప్ప సామాన్య ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, కొత్తపల్లి, యండపల్లి వ్యవసాయ సహకార పరపతి సంఘల అధ్యక్షులు మరిశెట్టి సత్తిబాబు, గుంద్రా రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

పెద్దాపురం: రాష్ట్ర ప్రజల సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక మరిడమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం జరిగిన 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే..' అనే కార్యక్రమానికి గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి అధ్యక్షత వహించారు. మండలంలోని ఆయా గ్రామాల గృహ సారథులు, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. దొరబాబు మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకునేందుకు సీఎం చేపట్టిన సంక్షేమ పథకాలు గతమెన్నడూ అమలు కాలేదన్నారు. ఇచ్చిన మాటకు అనుగుణంగా ప్రతి సంక్షేమ పథకాన్ని అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. 2024లో కూడా ఆయనే సీఎం కావాలన్నారు. గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వచ్చే నెలలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, సొసైటీ అధ్యక్షులు నల్లల నాగేంద్రబాబు, చల్లా చినవీర్రాజు, గుడివాడ సర్పంచ్ కనపర్తి చీమదొర, పరిమి శ్రీను, గోలి రామారావు, పుట్టా వెంకట్రావు, సుందరెడ్డి రాజు, లక్కాకుల కృష్ణ, వైవీకే సాయి పాల్గొన్నారు.

దేశ రక్షణలో భాగస్వామ్యం కావాలి

పెద్దాపురం:, ప్రతిఒక్కరూ దేశ రక్షణలో భాగస్వామ్యం కావాలని పెద్దాపురం జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శనివారం «మా మట్టి మా దేశం» అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా నెహ్రూ యువ కేంద్రం, రంగంపేట బ్లాక్‌లోని పెద్దాపురం మండల 23 గ్రామాల నుంచి సేకరించిన మట్టి కలశాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్ అధ్యక్షత వహించారు. దేశ స్వాతంత్ర్యం, పురోగతి కోసం పాటుపడిన మహనీయులను వక్తలు స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కె.రాజశేఖర్, ఎన్‌వైకే రంగంపేట బ్లాక్ ప్రతినిధి జి.సత్తిబాబు, మూర్తి, పద్మరాజు, వి.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యం

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



ఆరోగ్య కిట్లు అందజేస్తున్న దవులూరి దొరబాబు



గొల్లప్రోలులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ నరసింహ నాయక్

సామర్లకోట: సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తయారు చేయడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని పి.వేమవరంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ దేశచరిత్రలో ఎన్నడూ లేనిట్టుగా ప్రజల వద్దకే వైద్య సేవలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆస్పత్రులకు వెళ్లలేని రోగులను వారి ఇళ్ల వద్దనే గుర్తించడానికి ఇంటింటా ఆరోగ్య సర్వే చేస్తున్నట్టు వివరించారు. అవసరమైన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందిస్తారని చెప్పారు. డాక్టర్లు పి.ప్రశాంత్, శ్రీహిమవతి రోగులకు వైద్య పరీక్షలు చేసి మందుల కిట్లు అందజేశారు. జెడ్పీటీసీ ఎలిశెట్టి అమృత, సర్పంచ్ ఎలిశెట్టి నూకరత్నం , ఎంపీటీసీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీటీసీ కేశవరపు వీరమణి, ఎంఈఓ-2 పి.పుల్లయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు ఎలిశెట్టి నరేష్, ఎలిశెట్టి భీమన్నదొర పాల్గొన్నారు.

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ మేలు జరుగుతోందని శ్రీరాంపురం సర్పంచ్ రావి రమేష్ అన్నారు. మండలంలోని శ్రీరాంపురంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రమేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. వైద్య సేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. డాక్టర్లు 423 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి సురక్ష కిట్లను, బాలింతలకు పౌష్టికాహార కిట్లను స్థానిక నాయకులు అందజేశారు.

పెద్దాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కొండపల్లి ఎంపీటీసీ పోకనాటి నాగలక్ష్మి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం మండలంలోని కొండపల్లి గ్రామంలో సర్పంచ్ కొత్త చక్రరావు అధ్యక్షతన జరిగింది. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు.

పిఠాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ జె.నరసింహ నాయక్ సూచించారు. గొల్లప్రోలులో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వైద్య సదుపాయాలను ప్రజల ముంగిటకు తీసుకురావడానికే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విలువైన వైద్య సేవలు పొందాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో 45 రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హైవేలతో ట్రాఫిక్ సమస్యకు చెక్

- ఎన్‌హెచ్-516ఎఫ్‌కు ఎంపీ గీత, దొరబాబు శంకుస్థాపన



జాతీయ రహదారికి శంకుస్థాపన చేసిన ఎంపీ గీత, దవులూరి దొరబాబు

సామర్లకోట: జాతీయ రహదార్లతో ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. అచ్చంపేట ఏడీబీ రోడ్డు నుంచి పెద్దాపురం ఏడీబీ రోడ్డును కలుపుతూ నిర్మించే ఎన్‌హెచ్ 516ఎఫ్ జాతీయ రహదారికి శనివారం ఉండూరు జంక్షన్ వద్ద రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర నిధులు రూ.715 కోట్లతో 12.25 కి.మీ. పొడవున రోడ్డు నిర్మిస్తారని తెలిపారు. ఉండూరు జంక్షన్ నుంచి కాకినాడ రోడ్డులోని ముత్యాలమ్మ ఆలయం, వీకే రాయపురం, హౌస్సేన్‌పురం, సుగర్ ఫ్యాక్టరీ క్వార్టర్స్ మీదుగా రాక్ సిరామిక్స్ వద్ద పెద్దాపురం ఏడీబీ రోడ్డును 516 జాతీయ రహదారి కలుస్తుందని వివరించారు. ఈ మేరకు గోదావరి కాలువపై రెండు వంతెనలు నిర్మిస్తారన్నారు. ఈ రోడ్డు పూర్తయితే ట్రాఫిక్ సమస్య చాలా వరకూ తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ రహదారి ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేంద్ర, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఉండూరు సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి, ఎంపీటీసీలు ఎస్ శ్యామల, ఎం బుజ్జమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు సలాది రమేష్, గోలి బాబ్జి, మాకిరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాదగయను దర్శించిన తనికెళ్ల భరణి



పాదగయలో పూజలు చేస్తున్న తనికెళ్ల భరణి

పిఠాపురం: ప్రముఖ సినీ నటుడు, రచయిత తనికెళ్ల భరణి శనివారం పిఠాపురంలో పాదగయ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకారు. ఆయన పాదగయ పుష్కరిణి, కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి దేవి, పురూహూతికా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ శ్రీనివాసరావు, ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు ఆయనకు స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.

పట్టణాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి



మేజర్ డ్రైయిన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దొరబాబు

పెద్దాపురం: ప్రజాప్రతినిధులందరూ పట్టాణాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక 16వ వార్డు కబాడ్డి వీధిలో సుమారు రూ.13 లక్షలతో నిర్మించే మేజర్ డ్రెయిన్ నిర్మాణానికి శనివారం ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్; అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీతో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమానికి కౌన్సిలర్ సయ్యద్ అమీనాబీబీ అధ్యక్షత వహించారు. దొరబాబు మాట్లాడుతూ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కౌన్సిల్ ప్రాధాన్యమివ్వాలన్నారు. నియోజకవర్గంలోని రెండు పట్టణాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు, వాసంశెట్టి గంగ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



ఉప్పాడలో కృపారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన కృపారావు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని ఉప్పాడ నాయకర్ కాలనీ-2కి చెందిన మత్స్యకారుడు వంకా కృపారావు ఇటీవల వేటకు వెళ్లి సముద్రంలో పడి గల్లంతయ్యాడు. ఆయన కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే పరామర్శించి రూ.10 వేలు, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రభుత్వం ద్వారా అందే సాయం త్వరితగతిన అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం కొత్తపట్నానికి చెందిన పెనుబోతుల దావీదు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబాన్ని ఎమ్మెల్యే పరార్శించి రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, ఎంపీటీసీ యల్లాజీ తదితరులు ఉన్నారు.

ఆకతాయిల వీరంగం

సామర్లకోట: మద్యం మత్తులో ఆకతాయిలు స్థానిక 31వ వార్డులోని రామాలయంలో విగ్రహాలను పాడు చేశారు. పోలీసుల కథనం ప్రకారం శుక్రవారం రాత్రి కొందరు ఆకతాయిలు రామాలయం వద్ద మద్యం సేవించారు. స్థానిక మహిళలు వారిని నిలదీయడంతో, ఆ యువకులు వారిని దుర్భాషలాడి, విగ్రహాలను పాడు చేశారు. దీనిపై శనివారం ఉదయం ఆలయ కమిటీ ప్రతినిధులు పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ కె.దుర్గాప్రసాద్.. వార్డు కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్‌తో కలిసి విచారణ చేపట్టారు. కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.